అందం, అణకువ వుండటంతో పాటు సౌమ్యంగా మాట్లాడే కస్తూరంటే మా క్లాసులోని అబ్బాయిలకే కాదు కాలేజీ మొత్తానికీ క్రేజ్ వుండేది. ఏ ఇద్దరు విద్యార్థులు కలుసుకున్నా ఆమె గురించీ, ఆమె అందం గురించీ మాట్లాడుకోకుండా వాళ్ల సంభాషణ ముగిసేది కాదు. ఆమె క్లాసులో నుంచి బయటికొస్తే చాలు అందరి కళ్లూ ఆమె మీదే వుండేవి.

# ఏది ప్రేమ?

**కథ**

కస్తూరి మాత్రం వీటన్నింటినీ పట్టించుకొనేది కాదు. అందరితోనూ మంచిగా మాట్లాడేది కాని వెకిలి వేషాలు వేసే వారిని మాత్రం దూరంగా వుంచేది.

అసలు ఎలాంటి పోకిరీవాళ్లయినా సరే ప్రత్యూషపు తుషార బిందువుల స్వచ్ఛంగా వుండే ఆమె నవ్వును చూస్తే చాలు వాళ్ల మనసుల్లోని కల్మషం హరించుకపోయి ఆమె ఎదుట మంచిగానే మారిపోయేవారు. అది ఆమె గొప్పదనం.

కస్తూరంటే నాకు చాలా ఇష్టం.

మా క్లాసులో స్టడీస్‌లో నేనే ఫస్ట్ కావడంతో కస్తూరికి కూడా నేనంటే ప్రత్యేకమైన అభిమానం. ఆమె అందరికంటే నాతోనే ఎక్కువగా మాట్లాడేది. అందుకు నేను చాలా గర్వంగా ఫీలయ్యేవాడిని కూడా.

నేను అందరిలాగా ఆమె కంటపడటానికి, ఆమెతో మాట్లాడడానికి కష్టపడవలసిన అవసరం వుండేది కాదు. ఆమే నాతో మాట్లాడేది.

అందరూ నన్ను ''యు ఆర్ ఎ లక్కీ ఫెలో బాస్'' అనేవారు. నా ఛాతీ రెండంగుళాలు పెరిగేది.

మేము ఫైనల్ ఇయర్‌లో వుండగా ఒకసారి మా క్లాసు వాళ్లందరం కలిసి మూడురోజులు టూర్ ప్రోగ్రామ్ ప్లాన్ చేసుకున్నాము. అయితే మధ్యలో కస్తూరి రాననడంతో అబ్బాయిలందరూ ఒక్కొక్కరూ ఏదో ఒక కారణం చెప్పి ''డ్రాప్'' కావడం మొదలుపెట్టారు.

నాకు విషయం అర్థమైంది.

కస్తూరి రాకపోతే మొత్తం ప్రోగ్రామ్ క్యాన్సిల్ అయ్యేటట్టు కనిపించింది. కస్తూరితో నాకున్న పరిచయాన్ని వుపయోగించుకొని ఆమెతో మాట్లాడి చివరికి ఎలాగైతేనేం ఆమెని ఒప్పించ గలిగాను. మళ్లీ అందరూ తయారయ్యారు.

బస్సు మాట్లాడడం దగ్గర్నుంచీ ప్రతీపనిలో నేను ఇన్‌వాల్వ్ అయి శ్రమ పడ్డాను. అన్నీ పకడ్బందీగా జరగడానికి ఏర్పాట్లు చేసుకున్నాం.

ఓ సాయంత్రం కాలేజీ నుంచి బయలుదేరింది మా మూడు రోజుల యాత్రారథం.

మొదటిరోజు అరకులోయ అందాలను ఆస్వాదించాం. రెండవరోజు విశాఖలో సముద్రపు ఒడ్డున అలలతో ఆడుకున్నాం. ఆఖరిరోజైన మూడవ రోజు తిరుపతి వచ్చి దైవదర్శనం చేసుకున్నాం. ఆ రోజు సాయంత్రమే తిరుగు ప్రయాణం. అందరం ఒక చోట కూర్చున్నాం. అందరి ముఖాల్లోనూ అంతకు ముందు రెండ్రోజులుగా సరదాగా గడిపిన ఆనందం, ప్రయాణపు బడలిక, తిరిగి వెళ్తున్నామనే దిగులూ కలగలిపిన ఫీలింగ్స్ కనిపించాయి.

ఒక్కొక్కరం లేచి జీవితంలో తమ తమ ఆశలు, ఆశయాలు, చివరగా ఈ టూర్ ప్రోగ్రామ్ పట్ల తమ తమ అభిప్రాయాలు చెప్పాలని నిర్ణయించుకున్నాం.

ఒకరి తర్వాత ఒకరు లేచి తమ భావాలు, అభిప్రాయలు చెప్పారు. ఒకరిద్దరు టూర్ సక్సెస్ కావడానికి నేను తీసుకున్న 'ఇంట్రెస్ట్' ను పొగిడారు.

కస్తూరి వంతు వచ్చింది. ఆమె ఏం చెబుతుందోనని అందరం ఎవరికి వాళ్లం అలర్ట్‌గా కూర్చున్నాం.

ఆమె చెప్పడం ప్రారంభించింది.

''డియర్ ఫ్రెండ్స్, నాకు మొదట ఈ టూర్‌కు రావడానికి ఇష్టం లేదు. అయితే ఈ టూర్‌కు రాకపోయుంటే ఎంత మిస్ అయ్యేదాన్నో నాకు ఇప్పుడు అర్థమవుతోంది. ఇంత మంచి టూర్ సక్సెస్ కావడానికి శ్రమ పడి, రావడానికి నన్ను సుముఖురాలిని చేసిన 'శేఖర్' కు ప్రత్యేకంగా నా కృతజ్ఞతలు...''

నాకేమీ వినిపించలేదు.

కొద్దిసేపు నా మనసు గాల్లో విహరించింది.

ఆమె ప్రసంగంలో ప్రత్యేకంగా కృతజ్ఞతలు అందజేసిన సదరు శేఖర్‌ను నేనే మరి.

ఇష్టమైన వ్యక్తి చిన్న విషయంలోనయినా సరే మనల్ని ప్రత్యేకంగా అభినందించడమనేది మనసుకు ఎంతో ఆనందం కలిగిస్తుంది. ఆ ఆనందం తాలూకు మత్తులో నుంచి టూర్ నుంచి తిరిగివొచ్చిన రెండు రోజులకుగానీ బయటపడలేకపోయాను నేను.

రోజులు గడుస్తున్న కొద్దీ కస్తూరి మీద వున్న ఇష్టం ప్రేమగా రూపాంతరం చెందింది.

ఎగ్జామ్స్ దగ్గర పడడంతో ప్రేమ విషయాన్ని ప్రక్కన పెట్టడానికి కష్టపడవలసి వచ్చింది.

రెండు నెలలు కష్టపడి చదవాలని నిర్ణయించుకున్నాను. నోట్స్ ఇచ్చి పుచ్చుకోవడాలతో కస్తూరితో కమ్యూనికేషన్‌తో పాటు చనువు కూడా పెరుగుతూ వచ్చింది. వాళ్ల ఇంటికి కూడా తరచూ వెళ్లేవాడిని.

ఎగ్జామ్స్ వచ్చేశాయి. అన్నీ సంతృప్తికరంగా వ్రాశాను.

ఎగ్జామ్స్ పూర్తయ్యాక కూడా వాళ్ల ఇంటికి వెళ్లేవాడిని.

నా ప్రేమను ఆమెకు తెలియజేయడం అనేది నాకు అన్నిటికన్నా పెద్ద ఎగ్జామ్ అనిపించింది.

అప్పుడు చెబ్దాం ఇప్పుడు చెబ్దాం అనుకుంటూనే ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాను. మరో ప్రక్క నేను ఎమ్.ఎస్.సి ఎంట్రన్స్‌కు ప్రిపేర్ కావటం, డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ కావటం, ఉస్మానియా క్యాంపస్‌లో ఎమ్.ఎస్.సి కెమిస్ట్రీలో సీటు రావడం జరిగిపోయాయి.

కస్తూరితో నా ప్రేమ విషయం తెలుపకుండానే నేను హైదరాబాద్ వచ్చేశాను. కస్తూరి అక్కడే ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా చేరింది. వేరు వేరు ప్రదేశాల నుంచి వచ్చిన వివిధ రకాల మనస్తత్వాలు గల విద్యార్థులతో హాస్టల్‌లో కలిసి వుండటం వల్ల నాకు జీవితం గురించి వాస్తవిక దృష్టితో ఆలోచించడం ఎక్కువయ్యింది.

నాకు ఉద్యోగం వచ్చేంత వరకూ కస్తూరికి నా ప్రేమ విషయం చెప్పకూడదని నిశ్చయించుకున్నాను. బహుశా అందుకేనేమో మొదట్లో వారానికొకసారి ప్రత్యేకంగా కస్తూరిని చూడటానికి వూరికి వెళ్లేవాడిని. తర్వాత్తర్వాత బాగా తగ్గించాను. ఆమె పట్ల నా ప్రేమ మాత్రం అప్రతిహతంగా పెరుగుతూ వచ్చింది.

ఎమ్.ఎస్.సి. పూర్తయ్యింది. అదృష్టవశాత్తూ ఒక పెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

నాకు ఉద్యోగం వచ్చిన కొద్దిరోజులకే మా నాన్నగారు రిటైర్ కావడంతో మా కుటుంబ పరిస్థితుల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. బాధ్యతలు పంచుకోవడానికి మా అన్నయ్యలిద్దరూ ఇష్టపడకపోవడంతో మా అమ్మానాన్నలను, డిగ్రీ పూర్తయిన చెల్లెల్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చాను. కొత్తగా వచ్చిపడిన బరువు బాధ్యతల వల్ల నా ప్రేమ విషయాన్ని మరికొద్ది రోజులు వాయిదా వేశాను.

★ ★ ★

రోజూ ఆఫీస్‌కు కంపెనీ బస్సులో వెళ్లి వచ్చేవాడిని.

ఒకరోజు దారిలో ఎవరో కొత్త అమ్మాయి బస్సు ఎక్కింది. ఆ అమ్మాయి కొత్తగా చేరిన రిసెప్షనిస్ట్ అని ఆ అమ్మాయి పేరు శ్రీదేవి అని తెలిసింది.

శ్రీదేవి చాలా ఫాస్ట్ గర్ల్. బహుశా ఆమె చేసే ఉద్యోగం ఆమెకు అందరితో కలుపుగోలుగా వుండడం నేర్పి వుంటుంది.

ఆమె అందం ఆమెకు మరో ప్లస్ పాయింట్‌గా వుండేది.

మేమిద్దరం మొదట్లో అంతగా మాట్లాడుకోకపోయినా ఒకరి గురించి మరొకరికి ఇతరుల ద్వారా తెలిసింది. నా అభిప్రాయాలు, ఆలోచనల్లో చాలామటుకు ఆమె భావాలకు దగ్గరగా వుండటంతో మా ఇద్దరి మధ్యా పరిచయం రానురానూ పెరిగింది.

ఆఫీసుకు వెళ్లేప్పుడూ, వచ్చేప్పుడూ కంపెనీ బస్సులో ఇద్దరం పక్క పక్కనే కూర్చునే వాళ్లం.

ఇంతలో ఒకరోజు కస్తూరికి పెళ్లి నిశ్చయమయ్యిందన్న వార్త నాకు తెలిసింది.

నా ప్రేమ సంగతి కస్తూరితో చెప్పి అటో ఇటో తెల్చుకోవాలనుకుని హడావుడిగా వూరికి బయలుదేరాను.

కస్తూరి ఎప్పటిలాగే నవ్వుతూ పలకరించింది.

తన పెళ్లి విషయం చెప్పింది. ఏ మాత్రం మార్పులేని ఆమె ప్రవర్తనతో ఆమె నన్ను కేవలం ఒక మంచి స్నేహితుడి గానే చూస్తోందని, ఆమెకు నా మీద ప్రేమ అంటూ ఏమీ లేదని నాకు అర్థమైపోయింది. ఆమెతో ఆ పరిస్థితుల్లో నా ప్రేమ గురించి చెప్పడం అవివేకమనిపించింది.

నా ప్రేమ సంగతి అప్పటి వరకూ ఆమెకు తెలుప కుండా నాన్చినందుకు నన్ను నేనే నిందించుకొని ఆమెకు 'కంగ్రాట్స్' చెప్పి వచ్చేశాను.

కస్తూరిని నేను ప్రేమిస్తున్న సంగతి ఎవ్వరికీ తెలియకపో వడంతో నేను కొన్ని రోజులు దిగులుగా వుండటానికి కారణం మా ఇంట్లోకానీ, ఆఫీసులోకానీ ఎవ్వరూ తెలుసుకో లేకపోయారు.

శ్రీదేవి రెండు మూడుసార్లు అడిగినా నేను చెప్పలేదు. చేయిజారిన నా అదృష్టం గురించి ఎవ్వరికీ చెప్పదల్చుకో లేదు.

మా దూరపు బంధువు ఒకతను తనకు తెలిసిన వాళ్ల మ్మాయి సంబంధాన్ని నాకొరకు తీసుకొచ్చాడొకరోజు.

అమ్మాయి గవర్నమెంట్ టీచర్ జాబ్ చేస్తోంది. వాళ్లది హైదరాబాదే. నాకు ఇష్టం లేకపోయినా నా పెళ్లితో నా చెల్లెలి పెళ్లి ముడిపడి వుందని మా అమ్మా, నాన్నలు బలవంతపెట్ట డంతో పెళ్లిచూపులకు వాళ్ల ఇంటి కెళ్లాము.

అమ్మాయి పేరు అనిత. నేనా అమ్మాయితో ఏమీ మాట్లా డలేదు. ఆ అమ్మాయి అందం, మాటతీరు మా ఇంట్లో వాళ్లకు బాగా నచ్చాయి. అన్నిటికన్నా ముఖ్యంగా మా చెల్లె లికి కూడా వాళ్లకు తెలిసిన ఒక మంచి సంబంధం వుందని చెప్పడంతో మా అమ్మానాన్నలు మనసులో అక్కడికక్కడే ఆ సంబంధాన్ని ఖాయం చేసుకున్నారు.

వారం రోజుల్లో ఏ సంగతీ తెలియజేస్తాం అని చెప్పి వచ్చేశాం.

ఇది జరిగిన రెండు రోజుల తర్వాత ఒకరోజు ఆఫీసు నుంచి వచ్చేప్పుడు శ్రీదేవి నాకు ఒక గ్రీటింగ్ కార్డు ఇచ్చింది. కార్డు చూశాక తెలిసింది. ఆరోజు వాలెంటైన్స్ డే. అందులోని మాటర్ చదివాక ఆమె ఆరోజు గ్రీటింగ్ కార్డు ఇవ్వడంలోని ఉద్దేశ్యం నాకు అర్థమయ్యింది.

శ్రీదేవి నన్ను ప్రేమిస్తోంది. ఆనందం కలగడం కన్నా నా జీవితంలో ఒకదాని వెంట ఒకటి జరిగిన అనుకోని సంఘట నలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి.

శ్రీదేవిని చేసుకోవాలో లేక ఇంట్లో వాళ్లు చూసిన సంబంధం చేసుకోవాలో తేల్చుకోలేక సతమతమయ్యాను.

నిజానికి నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. కానీ ఎవర్నో ఒకర్ని చేసుకోవాలి. నా మనసేమో శ్రీదేవి వైపు మొగ్గు చూపింది. నాకు శ్రీదేవి గురించి కొంతవరకూ తెలుసు. అయితే ఆమె ఫాస్ట్ నేచర్ ఇంట్లో వాళ్లకు నచ్చుతుందో లేదో తెలియదు. ఒకవేళ ముందు ముందు ఒకరి పద్ధతులు మరొకరికి నచ్చకపోతే మా అమ్మానాన్నలను నేను తప్ప మంచిగా చూసుకొనే వాళ్లే వుండరు. అదీకాక వాళ్లు చూసిన సంబంధం ద్వారా నా చెల్లెలికి కూడా మంచి సంబంధం దొరికింది. ఒకవేళ నా ఇష్టప్రకారం శ్రీదేవిని చేసుకొంటే నా



చెల్లెలికి మళ్లీ అంత మంచి సంబంధం నేను చూడగలనా?

ఏం చేయాలి?

★ ★ ★

''ప్లీజ్ వదలండి. మామయ్యకు టాబ్లెట్స్ ఇచ్చి అయి దంటే అయిదు నిముషాల్లో వస్తాను.''

''త్వరగా రావాలి'' పట్టు సడలిస్తూ హెచ్చరించాను.

అలాగే డియర్ అంటూ బుగ్గమీద ముద్దుపెట్టుకొని వెళ్లింది. అరగంట తర్వాత వచ్చింది.

''అందుకే నిన్ను వదలనంది'' దగ్గరకు లాక్కుంటూ చిరుకోపంగా అన్నాను.

''అత్తయ్యకు కాళ్లు నెప్పిగా వున్నాయంటే కాస్సేపు కాళ్లు పట్టి వస్తున్నాను'' సంజాయిషీగా చెప్పింది.

నా మనసంతా ఆమెపై ప్రేమభావంతో నిండిపోయింది. స్కూల్‌కు వెళ్లొచ్చింతర్వాత కూడా ఇంటి పనులు చేసు కుంటూ మా అమ్మానాన్నలను ప్రేమగా చూసుకుంటుంది. ఇంత చేసినా అలసట, విసుగు, చిరాకు లాంటి వేవీ ఆమె మొహంలో కనిపించవు.

''ఐ లవ్యూ డియర్'' పొంగుతున్న ప్రేమను మాట లుగా మారుస్తూ అన్నాను.

మాటల ద్వారా కాదు. చేతల ద్వారా చూపండి అంటూ మీదకు లాక్కుంది నన్ను.

కొద్దిసేపటి తర్వాత అలసిపోయి నన్ను హత్తుకొని పడు కొని నిద్రలోకి జారుకుందామె.

నాకెందుకో ఆ సమయంలో కస్తూరి, శ్రీదేవి గుర్తుకొ చ్చారు. వాళ్లమీద అప్పట్లో నాకున్న ప్రేమ ఇప్పుడు నాకు కేవలం ఇష్టం, ఆకర్షణగా కనిపిస్తోంది.

ఇప్పుడు నా భార్య అనిత మీద కలిగే ప్రేమ నిజమైన ప్రేమే అనిపిస్తోంది.

భగవంతుడు మనికిచ్చిన గొప్పవరమో లేక బలహీనతో కానీ ప్రేమతోనే మనిషి జీవితం సార్థకమౌతుందనేది మాత్రం నిజం.

తల్లి మీద ప్రేమ ఉంటుంది. భార్య మీద ప్రేమ ఉంటుంది. రెండూ వేర్వేరు ప్రేమలు. రెండూ నిజమైనవే. ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ అని కూడా చెప్పలేం.

నా విషయం తీసుకొంటే నాకు పెళ్లయిందని చెప్పి కస్తూరి, శ్రీదేవిల మీద అంతకుముందున్న ఇష్టం పోయిం దని చెప్పలేను. అలాగే పెళ్లికి ముందే ప్రేమించినా విఫలమ య్యానని చెప్పి నా భార్యను బాధపెట్టలేను. ఆమెను ప్రేమిం చకుండా ఉండలేను. అయినా ప్రేమనేది నేరమూ కాదు, పాపమూ కాదు. ప్రేమ పేరుతో ఎవరికీ బాధ కలిగించనంత వరకూ ఎంతమంది మీద ప్రేమఉన్నా ఫర్లేదేమోననుకుంటూ నిద్రలోకి జారుకున్నాను. ★

**రాంభూపాల్ రెడ్డి**